# పేకాటలో వసంత రాజీయం

ఓగేటి ఇందిరా దేవి

ఆరోజు ఆదివారం.

ముందుగదిలో జోరుగా హుషారుగా సాగుతున్నది చతుర్ముఖ పారాయణం. రాజశేఖరం ఫ్రెండ్స్ సర్కిల్ అంతా అక్కడే పోగుపడి వున్నది. సిగరెట్ల పొగ గదినంతా ఆవరించుకోవటమే కాకుండా వంటింటిని కూడా చుట్టబెడుతున్నది. ఉక్కిరిబిక్కిరైపోతున్నది వసంత.

'పొమ్మనలేక పొగబెట్టటం అంటే ఇదేనా ఏమిటి?'

'ఈమధ్య ఈయనగారి హోదా పెరిగాక పేకాట రుచిమరిగారు! అలాంటి ఫ్రెండ్సూ పెరిగారు. ఇంక ఆ డ్రింకు అలవాటు కూడా చేసేసుకోరుగదా శ్రీవారు! పేకాట నేర్పించిన ప్రబుద్ధులు తాగుడు అలవాటు మటుకు చెయ్యరా ఏమిటి? అమ్మో! ఇహ ఆ అలవాటు అయిందంటే బ్రహ్మరుద్రాదులు దిగి వచ్చినా మార్చలేము. పూలచెండులాంటి ఈ సంసారం వాడి వత్తలై చిందరవందరై పోతుందిగాబోలు దేవుడా!?' ఏడుపొస్తున్నది వసంతకి.

"వసూ! ఇంకోసారి కాఫీ కావాలోయ్!" రాజు కేకతో ప్రస్తుతంలోకి వచ్చింది వసంత.

'ఆదివారం వచ్చిందంటే చాలు ఈ కాఫీ అందింపులతో నడుం పడిపోతున్నది బాబూ! హాయిగా తనూ రాజూ ఆదివారాలు ఎంజాయ్ చేసి ఎన్నాళ్ళైంది!' ఆయన తన పాటలు వినేవారు. ఇద్దరూ కలిసి కారమ్స్ ఆడుకునేవారు. రేడియో నాటకం వినేవాళ్ళు. వచ్చిన ప్రోగ్రాముంటే ఏ రవీంద్రభారతికో, సినిమాకో, గానసభకో వెళ్ళే వాళ్ళిద్దరూ-ప్చ్... ... ఈ పాడు ప్రమోషన్ నా ఏడుపుకే వచ్చింది" అని నిట్టూర్చింది వసంత.

ఆ రూము నిండా మగవాళ్ళు అలా కూచుని వుంటే ఇవతలి రూములో మసలాలంటే చాలా ఇబ్బందిగా, ఎంబరాసింగ్‌గా వుంది వసంతకి. వున్నదే మూడు గదుల కొంపాయె! సిగరెట్ పీకలు వగైరాలతో చిందరవందరగా తయారవుతుందా గది. సర్దేటప్పటికి వసంత తలప్రాణం తోకకి వస్తున్నది. ఎన్ని విధాల చెప్పినా రాజు వినిపించుకుంటేనా? కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లుంది అతగాడి పని.

"మీ ఇల్లు విశాలంగా వుంటుందోయ్- మీ ఆవిడగారి చేతి కాఫీ రుచిగా వుంటుందోయ్" అంటూ ఆ మూకంతా ఇక్కడే చేరుతున్నారు ప్రతి వారమూనూ. 'అరె. వారానికొకసారి వచ్చే ఆలుమగల పగటి ఏకాంతాన్ని నిర్దాక్షిణ్యంగా ఖూనీ చేసేస్తున్నామే అన్న కనీస జ్ఞానం అయినా వుండద్దూ వాళ్ళకిమటుకు?' కసిగా కింది పెదవి కొరుక్కోబోయిందామె.

సోమవారం రాత్రి రాజు దగ్గర కూచుని తమలపాకు చిలకలు చుట్టిస్తూ, తమాషాగా మాట్లాడుతూ, నవ్విస్తూ, కవ్విస్తూ "ఏవండీ! నేను చెప్పిన విషయం ఏం చేశారు?" అని లాలనగా అడిగింది వసంత.

"ఏదీ టీవీ, సంగతేనా?"


"ఔనండీ"

"పై వారానికల్లా టీవీ రాకపోతే అప్పుడడగవోయ్"

"నిజంగా? అబ్బ- మా శ్రీవారు ఎంత మంచివారో"- మురిసిపోతూ అదనంగా రెండు ముద్దులెక్కువ పెట్టేసింది వసంత.

రాజు మాట ప్రకారమే టీవీ వచ్చేసింది.

ఆదివారమూ వచ్చింది యథాప్రకారంగా - కాని వసంతా వాళ్ళిల్లు మాత్రం ఆ రోజు యథాప్రకారంగా లేదు. తండోపతండాలుగా వస్తున్న నారీమణులని చూసి తప్పుకోక తప్పలేదు రాజు పేకాట ఫ్రెండ్స్‌కి. నిస్సహాయ స్థితిలో, "పోనీ మీరూ వుండి టీవీ చూడండి



"బ్రదర్స్" అన్నాడు రాజు. ఎందుకంటే ఆ గదే విశాలమైనది. అక్కడే టీవీ పెట్టించింది వసంత.

"అహ కాదులే- కాదులే. మేము రంగారావు ఇంటి దగ్గర చేరతాం- టీవీ చూడాలని లేదు" అని తప్పించుకున్నారు ఒక్కొక్కళ్ళే- వాళ్ళ భార్యలు కూడా ఆ ఆడవాళ్ళల్లో ఉన్నారు. మరి హడల్ కదా!

"ఏవండోయ్! వనజాక్షిగారి రెండో అబ్బాయికి తలకాయ నెప్పిగా వుందిట. కాస్త యాస్ప్రో మాత్ర తెచ్చిపెడుదురూ?" అంటూ వచ్చింది వసంత ఆ ఆడ మళయాళంలో ఎక్కడ కూహోవాలో తెలీక అవస్థ పడుతున్న భర్త దగ్గరికి.

'నీ కేమన్నా పిచ్చెక్కిందా?" అన్నట్లు చూశాడతను ఆమె వేపు గుర్రుగా. అదేం పట్టనట్లు "చూశారూ చెప్పటం మరిచిపోయాను- వస్తూ వస్తూ మిఠాయి భండారు దగ్గర ఆగి రెండు కిలోల స్వీటూ, హాటూ పట్రండి. కాస్త ఆకులూ వక్కపొడి కూడానూ- బొత్తిగా ఇంటికొచ్చిన ముత్తయిదువులను ఉత్త చేతులతో పంపటం బావుండదు" అని అంటూనే హడావిడిగా వెళ్ళిపోయింది ఆడంగుల మధ్యకి.

అలాంటి అనేక విషమ సమస్యల మధ్య ఆ ఆదివారం సాయంత్రం గడిచాక- టీవీలో సినిమా అయిపోయిన తరువాత-

సోమవారం రాత్రి రాజు ఎంతో బుద్ధిమంతుడిలా వసంత దగ్గర కొచ్చి కూచున్నాడు. తనుతెచ్చిన పూలు ఆమె తలలో తురిమి....

"వసూ! నా పేకాట ఫ్రెండ్స్‌ని రానివ్వను సరిగదా నేను కూడా పేకాట మానేస్తున్నాను. నిజం. నీ మీదొట్టు. కానీ... ... కానీ......" నానుస్తూ అడిగాడతను.

విగురుటాకుల వంటి పెదవుల మధ్య కొంటె నవ్వు బిగబట్టింది వసంత-

"కానీ..." అని ప్రశ్నిస్తూ.

"కానీ..." తల గోక్కున్నాడు రాజు.

"పారిజాత గింజల రసం తీసి తలకిరాస్తే శుభ్రంగా తుడిచిపెట్టుకుపోతాయిట!!" సలహా చెప్పింది వసంత సిన్సియర్‌గా.

"ఏం పోతై?" అయోమయంగా అడిగాడు రాజు.

"అవే పేలు. అదేపనిగా తల గోక్కుంటుంటేనూ"-

"అమ్మదొంగా! నిన్నూ- నిన్నూ..."

"సరే. ఇంతకీ సెలవివ్వండి అసలు సంగతి?"

ఈసారి మళ్ళీ తల గోక్కోబోయి మానేశాడు రాజు. "ప్లీజ్ వసూ! మీ వనితా సేన సాయంతో నువ్వు జరిపే ప్రచ్ఛన్న యుద్ధం ఆపేసెయ్యి. అంతమంది ఆడవాళ్ళ మధ్య చాలా ఎంబరాసింగ్‌గా వుంది నాకు. నేను టీవీ కొన్నది మన కుటుంబం కోసం వసూ!" బితుకు బితుకు మంటూ అడిగేశాడు రాజు.

"ఓకే ... ఓకే" అంటూ కిలకిలమన్నది వసంత, రాజశేఖర్ అర్ధాంగ లక్ష్మి,విజయం తెచ్చిన హుషారుతో.

నవ్వుకెరటాలతో ఎగసి పడుతున్న నదీ సుందరి వసంతవేపు సాగర గంభీరుడై చేతులు చాచాడు రాజశేఖర్. ●

## స్వస్థత చేకూర్చే బృందాలు

బాన్: మానసికాందోళనలతోను, పరీక్షల భయంతోను స్వస్థత కోల్పోయిన ఒక 28 సంవత్సరాల యువకుడు తిరిగి పూర్తి మానసికారోగ్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని పొందగలిగాడు. ఇతను చేసిందల్లా ఒకటే. ఒక స్వయంసేవక బృందంలో సభ్యుడుగా చేరాడు. పశ్చిమజర్మనీలో ఇటువంటి స్వయం సేవక బృందాలు పదివేల వరకూ ఉన్నాయి. వీటిలో మొత్తం ఒక లక్ష మంది సభ్యులున్నారు. ఒంటరి' జీవితం కంటే పది మందితో కలసి ఉండటమే లాభకరమనేది ఈ బృందాల ఏర్పాటు వెనుకగల రహస్యం. ఇటువంటి మానసిక వ్యాధులతో బాధపడే వారు ఈ బృందాలలో సభ్యులుగా చేరి పరస్పర చర్చల ద్వారా, వీరి అనుభవాలను పంచుకుని స్వస్థత పొందుతారు. సారాయి, మత్తు మందులకు అలవాటు పడిన వారి కోసం కూడా స్వయం సేవక బృందాలు ఉన్నాయి.

(గ్లోబల్)


# జ్యోతిచిత్ర

## సినిమా నవలల పోటీలో మొదటి బహుమతి

## రూ. 5000/- పొందిన 'ఇంద్రజాలం' నవల

'జీవితం ఓ వరం. మనిషి ఏ మార్గంలో నడిచినా సంతోషంగా సుఖంగా బ్రతకడాన్ని మించిన పరమార్థం లేదు' అన్న సిద్ధాంతాన్ని జీర్ణించుకున్న పాతికేళ్ళ యువకుడికీ......

"పదిమందినీ మోసం చేసి పాపిష్టి డబ్బుతో అందలాలెక్కి గాలిలో మేడలు కట్టుకునే నువ్వు ఏదో ఒకరోజున చిన్న గాలికే నేల మీద పడిపోతావ్. కష్టపడనివాడికి బ్రతికే అర్హత లేదు. ఎదుటి వాడిని మోసం చేసి తెచ్చిన వేల రూపాయిల కంటే చెమటోడ్చి సంపాదించిన పది రూపాయిలకే విలువ ఎక్కువ" అని ఎదురు తిరిగిన అతని ఇరవయ్యేళ్ళ చెల్లెలికీ మధ్య జరిగిన సిద్ధాంతాల యుద్ధంలో గెలుపు ఎవరిది? నేటి సమాజంలో మాయ చెయ్యనిదే మనిషి బ్రతకలేడు. ఎదుటి వాడిని బుట్టలో వెయ్యందే ఎవడికీ పొట్టగడవదు. రకరకాల హంగులతో రంగుల వల పన్ని ఎదుటివాడి అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునే ప్రతి ఒక్కడూ ఐంద్రజాలికుడే. ఇంద్రజాలమే ఈ యుగధర్మం.

ఉత్కంఠతో సాగే వేములపల్లి మోహన్‌రావు సినిమానవల 'ఇంద్రజాలం'

'జ్యోతిచిత్ర' 7.3.86 సంచిక నుంచే ప్రారంభం!